APTEL/2009/29308

స్నేహిత

# ఎక్స్‌ప్రెస్

నిజం దాగదు.. వార్త ఆగదు

తెలుగు దినపత్రిక

16-04-2026
గురువారం
హైదరాబాద్
సంపుటి: 17 । సంచిక: 173
పేజీలు: 04 । వెల: 5/-
ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్

FOLLOW:
https://epaper.expresstelugudaily.com



2

## పర్యాటక ప్రదేశాలకు తెలంగాణ నిలయం

# దేశంలో నక్సలిజం అంతమైంది

- మావోయిస్టు ప్రభావిత జిల్లాలు లేవు
- కేంద్రం అధికారిక ప్రకటన
- సమాజంలో అన్యాయాలకు పరిష్కార మార్గాలు రాజ్యాంగంలో ఉన్నాయి
- హింస ద్వారా కాకుండా చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారం లభిస్తుంది
- జనజీవన స్రవంతిలో కలిసిన వారికి ప్రయోజనాలను అందిస్తాం.. పునరావాసం కల్పిస్తాం
- నక్సలిజాన్ని సమర్థించే వారు ఈ విషయాన్ని తెలుసుకోవాలి: అమిత్ షా

ఐదు దశాబ్దాలకు పైగా దేశాన్ని పీడించిన నక్సలిజం అంతమైందని కేంద్రం అధికారిక ప్రకటన చేసింది. దేశంలో ఇప్పుడు నక్సల్స్ ప్రభావిత జిల్లా ఏదీ లేదని కేంద్ర హోం శాఖ రాష్ట్రాలకు అధికారికంగా సమాచారం పంపింది. ఈ మేరకు తొమ్మిది రాష్ట్రాలకు లేఖలు రాసిన కేంద్రం, మార్చి 31 నాటికి దేశం నక్సల్ నుంచి విముక్తి పొందిందని పేర్కొంది. గతంలో నక్సల్ ప్రభావిత ప్రాంతాలుగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపుర్, ఝార్ఖండ్‌లోని పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లాల్లో కూడా ఇప్పుడు హింస నియంత్రణలోకి వచ్చిందని కేంద్రం తెలిపింది.



2

# భూసేకరణపై నిరసన

- వికారాబాద్‌లో కవిత అరెస్టు
- ప్రభుత్వం పారిశ్రామికీకరణ ముసుగులో రైతుల పొట్ట కొడుతోంది
- భూసేకరణ ఆపకపోతే ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తాం
- తక్షణమే భూసేకరణ నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకోవాలన్న జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



2

ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. మహిళా రిజర్వేషన్ చట్టంలో మార్పుల పేరిట ఓబీసీల హక్కులను హరిస్తూ వారి వాటాను చోరి చేస్తున్నారని ఆరోపించారు. డిలిమిటేషన్ ద్వారా అధికారాన్ని కేంద్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ రెండు చర్యలూ దేశద్రోహ కార్యకలాపాలేనని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు గురువారం పార్లమెంటు ముందుకు రానున్న నేపథ్యంలో ప్రజలను ఉద్దేశించి రాహుల్ గాంధీ మాట్లాడుతూ ఈ మేరకు వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేశారు. నియోజకవర్గాల పునర్విభజన పేరుతో దక్షిణాది రాష్ట్రాలు, చిన్న రాష్ట్రాలకు అన్యాయం జరగనివ్వబోమన్నారు.రాజ్యాంగంలో భాగమైన మహిళ బిల్లును 2023లో పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించినట్లు రాహుల్ తెలిపారు. ప్రభుత్వం ఇప్పుడు ప్రతిపాదించిన సవరణలు మహిళా రిజర్వేషన్లకు సంబంధమే లేదన్నారు. మహిళా రిజర్వేషన్ అమలు నిజంగా చేయాలనుకుంటే 2026 జనగణన ఆధారంగా ముందుకెళ్లాలని ఆయన డిమాండ్ చేశారు. అలా చేస్తే కాంగ్రెస్ పూర్తి మద్దతు ఇస్తుందని తెలిపారు. దేశంలో వెనుకబడిన వర్గాలు సుమారు 50 శాతం ఉన్నప్పటికీ వారికి తగిన ప్రాతినిధ్యం ఇవ్వకుండా ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆయన అన్నారు. డీలిమిటేషన్ ప్రక్రియ వల్ల దక్షిణ, ఈశాన్య, చిన్న రాష్ట్రాలకు తీవ్ర నష్టం కలుగుతుందని రాహుల్ గాంధీ హెచ్చరించారు. వారి ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

# మోడీ దేశద్రోహ చర్యలు



### మహిళా రిజర్వేషన్ చట్టంలో మార్పుల పేరిట ఓబీసీల హక్కులను హరిస్తున్నారు

### డీలిమిటేషన్ ద్వారా అధికారాన్ని కేంద్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు

- ఈ ప్రక్రియ వల్ల దక్షిణ, ఈశాన్య, చిన్న రాష్ట్రాలకు తీవ్ర నష్టం
- 50 శాతం ఉన్న బీసీలకు ప్రాతినిధ్యం ఇవ్వకుండా కుట్ర
- పాత డేటా వద్దు.. 2026 కులగణన డేటాప్రకారం జరగాలి..
- బీసీలకు అన్యాయం జరగనివ్వం
- లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

2



2

## వడదెబ్బ బాధితులకు సత్వరమే చికిత్స అందించాలి

- ఎండల తీవ్రత పెరుగుతున్నందున అప్రమత్తంగా ఉండాలి
- తక్షణమే చికిత్స అందించేందుకు అన్ని ఆసుపత్రుల్లో ఇప్పటికే ఏర్పాట్లు చేశాం
- పెద్ద ఆసుపత్రులలో ప్రతి బ్లాక్‌లో, ప్రతి ఫ్లోర్‌లో డ్రింకింగ్ వాటర్ సౌకర్యం ఉండాలి
- రోగులకు, డాక్టర్లకు ఇబ్బంది కలగకుండా ఫ్యాన్లు, కూలర్లు ఏర్పాటు చేయాలి
- ఐసీయూలలో ఏసీలు సక్రమంగా పనిచేసేలా చూడాలి
- మంత్రి దామోదర రాజనర్సింహ




2

## కుల సర్వే నివేదిక విడుదలకు ప్రభుత్వం సిద్ధం

- ఈ సర్వే ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, శాస్త్రీయంగా ముగిసింది
- రాష్ట్రంలోని ప్రతి గడపకూ వెళ్లి వివరాలు సేకరించాం
- ఇప్పటివరకు 97.10 శాతం సమగ్ర సర్వే పూర్తయింది
- మిగిలిన స్వల్ప శాతాన్ని కూడా త్వరితగతిన క్రోడీకరిస్తున్నాం
- 'సెల్ఫ్ డిక్లరేషన్' పద్ధతిలో అత్యంత పకడ్బందీగా నమోదు చేశాం



2

## తెలంగాణలో కాంగ్రెస్ నేతలకు శుభవార్త


- నామినేటెడ్ పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్
- సీఎం రేవంత్‌తో మీనాక్షి నటరాజన్ భేటీ
- తాజా రాజకీయ పరిణామాలపై చర్చ

## డీలిమిటేషన్‌పై బీఆర్ఎస్ వైఖరి స్పష్టం

- మహిళా రిజర్వేషన్ బిల్లును నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపెట్టొద్దు
- మహిళా రిజర్వేషన్లకు బీఆర్ఎస్ పార్టీ మొదటి నుంచీ సంపూర్ణ మద్దతు ఇస్తోంది
- కేంద్రం పార్లమెంటులో ప్రవేశ పెడుతున్న బిల్లులో స్పష్టత లేదు
- కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ఇలాంటి అస్పష్టమైన నిబంధనలు పెడుతున్నారు
- దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గిస్తే ఊరుకోబోం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




2



2

## గ్లోబల్ హబ్‌గా తెలంగాణ ఎదుగుతోంది

- నైపుణ్యాధారిత కోర్సులను, వినూత్న సిలబస్‌ను ప్రవేశపెట్టాం
- విద్యార్థులకు అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి
- టీజీసీహెచ్ఈ చైర్మన్ బాలకిష్టారెడ్డితో న్యూకాసిల్ యూనివర్సిటీ ప్రతినిధి బృందం భేటీ
- 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ', ఏఐ యూనివర్సిటీ, 'ఫ్యూచర్ సిటీ' వివరించిన చైర్మన్

## మార్కెట్ యార్డుల్లో 'జీరో బిజినెస్' జరగొద్దు

- అక్రమాలకు పాల్పడే ట్రేడర్ల లైసెన్సులు రద్దు చేయడానికి వెనుకాడవద్దు
- అధికారులు సహకరిస్తే వారిపై కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటాం
- మార్కెట్ యార్డులకు వచ్చే రైతులకు సౌకర్యాలను ప్రాధాన్యత క్రమంలో కల్పించాలి : మంత్రి తుమ్మల



2

# భూసేకరణపై నిరసన..

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** వికారాబాద్ జిల్లాలో ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో భూసేకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న రైతుల పోరాటం ఉగ్రరూపం దాల్చింది. పోలీసులు, రైతులకు మధ్య జరిగిన తోపులాటతో పరిస్థితి ఒక్కసారిగా రణరంగంగా మారింది. దీంతో రైతులకు మద్దతుగా పరిగి ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నాకు దిగిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. పరిగి ప్రాంతంలో పరిశ్రమల స్థాపన కోసం తమ సారవంతమైన భూములను లాక్కోవద్దంటూ రైతులు గత కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ఈ పోరాటానికి అండగా నిలిచిన కవిత, బుధవారం వందలాది మంది రైతులతో కలిసి ఆర్డీవో కార్యాలయాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. అయితే, పోలీసులు భారీగా మోహరించి రైతులను అడ్డుకోవడంతో ఉద్రిక్తత మొదలైంది. ధర్నా నిర్వహిస్తున్న కవితను



పోలీసులు అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేయగా, రైతులు, కార్యకర్తలు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య గంటల తరబడి తోపులాట జరిగింది. పరిస్థితి చేయి దాటిపోతుండటంతో పోలీసులు కవితను బలవంతంగా వాహనం నుంచి కిందకు దించి, ఎన్టీఆర్ చౌరస్తా మీదుగా తరలించారు. ఆమె వాహనాన్ని కూడా అక్కడి నుంచి వేరే ప్రాంతానికి తరలించినట్లు సమాచారం. అరెస్టుకు ముందు కవిత మాట్లాడుతూ.. "రైతుల పొట్ట కొట్టి పరిశ్రమలు కట్టడం ఏంటని?" ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతులు ప్రాణాలకు తెగించి తమ భూములను కాపాడుకుంటుంటే, వారిపై లాఠీచార్జ్ చేయడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూసేకరణ నోటిఫికేషన్ రద్దు చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆపదని ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుతం కవిత అరెస్టుతో వికారాబాద్‌లో ఉద్రిక్తత కొనసాగుతోంది. ఎక్కడికక్కడ జాగృతి శ్రేణులు రాస్తారోకోలు చేపట్టడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. శాంతిభద్రతల దృష్ట్యా జిల్లా కేంద్రంలో అదనపు పోలీసు బలగాలను మోహరించారు.

## మోడీ దేశద్రోహ చర్యలు



**(మొదటి పేజీ తరువాయి)**

అనుకుంటున్నారని రాహుల్ గాంధీ అన్నారు. 'ఎప్‌స్టీన్ ఫైళ్ల గురించి మోడీ భయపడుతున్నారని నాకు తెలుసు. 35లక్షల ఫైళ్లు యూఎస్‌లో ఉన్నాయి. వాటి తాళంచెవి ట్రంప్ వద్ద ఉందని ఆందోళన పడుతున్నారు. కానీ ఇది పద్ధతి కాదు. అనుకున్న విధంగా డీలిమిటేషన్ జరిగి బీసీలకు మోడీ అన్యాయం చేయాలనుకుంటున్నారు. అది జరగనివ్వం. పాత డేటా వద్దు. 2026 కులగణన డేటాప్రకారం జరగాలి. బీసీలకు అన్యాయం జరగనివ్వం. బీసీలు, దళితులు, ఆదివాసీలకు వారి హక్కులు వారికి ఇవ్వండి. దక్షిణ, ఈశాన్య రాష్ట్రాలకు అన్యాయం జరిగితే సహించే ప్రసక్తే లేదు" అని రాహుల్ గాంధీ తెలిపారు.

## డీలిమిటేషన్‌పై బీఆర్ఎస్ వైఖరి స్పష్టం

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** మహిళా రిజర్వేషన్ బిల్లును నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)తో ముడిపెట్టడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా వ్యతిరేకించారు. మహిళా బిల్లు అమలులో కేంద్రం అనుసరిస్తున్న అస్పష్ట వైఖరిని ఆయన తప్పుబట్టారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మహిళా రిజర్వేషన్లకు బీఆర్ఎస్ పార్టీ మొదటి నుంచీ సంపూర్ణ మద్దతు ఇస్తోందని కేటీఆర్ స్పష్టం చేశారు. అయితే, బిల్లును అమలు చేయకుండా డీలిమిటేషన్ సాకుతో కాలయాపన చేయడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్రం పార్లమెంటులో ప్రవేశ పెడుతున్న బిల్లులో స్పష్టత లేదని, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ఇలాంటి అస్పష్టమైన నిబంధనలు పెడుతున్నారని ఆరోపించారు. డీలిమిటేషన్ పేరుతో పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గిస్తే ఊరుకోబోమని కేటీఆర్ హెచ్చరించారు. "దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణను పాటిస్తూ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అటువంటి రాష్ట్రాలకు సీట్ల పెంపులో అన్యాయం జరిగితే సహించేది లేదు. ప్రస్తుతం పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాలకు ఉన్న 24 శాతం సీట్ల వాటాను అలాగే కొనసాగించాలి" అని ఆయన డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన మాత్రమే సీట్లను కేటాయించి, దక్షిణాది ప్రాతినిధ్యాన్ని తగ్గిస్తే ప్రజల నుంచి తీవ్రమైన తిరుగుబాటు వస్తుందని కేటీఆర్ హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఇలాంటి విభజన రాజకీయాలు వదిలేసి, ప్రజా సంక్షేమంపై దృష్టి సారించాలని హితవు పలికారు. దేశ సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసే ఏ ప్రయత్నాన్నైనా అడ్డుకుంటామని ఆయన పేర్కొన్నారు.

## పర్యాటక ప్రదేశాలకు తెలంగాణ నిలయం

**షేక్‌పేట:** దేశంలోనే అత్యద్భుత వారసత్వ కట్టడాలు, పర్యాటక ప్రదేశాలకు తెలంగాణ నిలయమని.. దేశ, విదేశీ పర్యాటకులను మరింత ఆకర్షించేలా పర్యాటక రంగ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం ఆయన కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్‌తో కలిసి షేక్‌పేట కుతుబ్‌షాహీ టూంబ్స్, గోల్కొండ కటోరా హౌస్, ఖజానా బిల్డింగ్ ఆర్కియాలజికల్ మ్యూజియంలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యాటక ప్రదేశాల్లో సందర్శకుల కోసం మౌలిక వసతులను కల్పిస్తున్నామని అన్నారు. ఇందుకు అనుగుణంగా బడ్జెట్‌ను కేటాయిస్తున్నామని తెలిపారు.

### పర్యటన సాగిందిలా..

టూంబ్స్‌లో జరుగుతున్న పునరుద్ధరణ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అనంతరం అక్కడి ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్‌నూ సందర్శించారు. వక్ఫ్‌బోర్డు ట్రైబ్యునల్‌లో కేసులు ఉన్న ప్రాంతాలను మినహాయించి మిగతా ప్రాజెక్టులను పూర్తి చేయాలని సూచించారు. టూంబ్స్ నుంచి గోల్కొండ కోట వరకు 1.3 కి.మీ. రోప్ వే ప్రాజెక్టుపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు అనుమతుల దశలో ఉందని అధికారులు వివరించారు. అనుమతులు వచ్చిన వెంటనే డీపీఆర్ సిద్ధం చేయాలని ఆదేశించారు. కటోరా హౌస్ మురికి కూపంగా మారిందని, పూడికలు తొలగించి పర్యాటక ఆకర్షణగా తీర్చిదిద్దాలన్నారు. గోల్కొండ కోటకు వచ్చే పర్యాటకుల కోసం చార్మినార్ లాడ్ బజార్ తరహాలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని మంత్రి ప్రతిపాదించారు. తద్వారా చేనేత, హస్త కళాకారులకు ఆదాయం కల్పించవచ్చన్నారు. అనంతరం ఖజానా బిల్డింగ్ ఆర్కియాలజికల్ మ్యూజియంను సందర్శించారు. మ్యూజియాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అక్కడ చేనేత, హస్త కళలను ప్రోత్సహించేందుకు ప్రదర్శన ఏర్పాటు చేయాలన్నారు. మ్యూజియం వెనుక ఉన్న ఆక్రమణలతోపాటు కటోరా హౌస్ వద్ద ఉన్న కబ్జాలను పోలీసుల సహాయంతో వారం రోజుల్లో తొలగించాలని ఆదేశించారు. పర్యటనలో రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీ గౌతమి, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున రావు, పలు విభాగాల అధికారులు ఉన్నారు.

## కుల సర్వే నివేదిక విడుదలకు ప్రభుత్వం సిద్ధం

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కుల సర్వే తుది నివేదికను విడుదల చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఇవాళ రాత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఈ సర్వే ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, శాస్త్రీయంగా ముగిసిందని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి గడపకూ వెళ్లి వివరాలు సేకరించినట్లు మంత్రి తెలిపారు. ఇప్పటివరకు 97.10 శాతం సమగ్ర సర్వే పూర్తయిందని, మిగిలిన స్వల్ప శాతాన్ని కూడా త్వరితగతిన క్రోడీకరిస్తున్నామని తెలిపారు. ప్రజల నుంచి సేకరించిన సమాచారాన్ని 'సెల్ఫ్ డిక్లరేషన్' పద్ధతిలో అత్యంత పకడ్బందీగా నమోదు చేశామని ఆయన పేర్కొన్నారు. కులగణన ప్రక్రియను విజయవంతం చేసేందుకు ప్రభుత్వం సుమారు 1.3 లక్షల మంది ప్రభుత్వ సిబ్బందిని వినియోగించిందని మంత్రి పొన్నం వివరించారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా, రాజకీయ జోక్యం లేకుండా కేవలం గణాంకాల ఆధారంగానే ఈ సర్వే నిర్వహించామని చెప్పారు. నిష్పాక్షికంగా జరిగిన ఈ ప్రక్రియ తెలంగాణ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఈ కుల గణన దేశానికే ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సామాజిక న్యాయం చేకూర్చడంలో ఈ నివేదిక కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. 'మా ప్రభుత్వం సేకరించిన ఈ విలువైన డేటాను కేంద్ర ప్రభుత్వం కూడా పరిగణనలోకి తీసుకోవాలి. దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాల్సిన అవసరం ఉంది' అని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి, సంక్షేమ పథకాల అమలుకు ఈ నివేదిక దిక్సూచిగా మారుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. నివేదిక విడుదలైన అనంతరం గణాంకాల ఆధారంగా భవిష్యత్తు ప్రణాళికలు రూపొందిస్తామని ఆయన వెల్లడించారు.




## దేశంలో నక్సలిజం అంతమైంది

**నేషనల్ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ఐదు దశాబ్దాలకు పైగా దేశాన్ని పీడించిన నక్సలిజం అంతమైందని కేంద్రం అధికారిక ప్రకటన చేసింది. దేశంలో ఇప్పుడు నక్సల్స్ ప్రభావిత జిల్లా ఏదీ లేదని కేంద్ర హోం శాఖ రాష్ట్రాలకు అధికారికంగా సమాచారం పంపింది. ఈ మేరకు తొమ్మిది రాష్ట్రాలకు లేఖలు రాసిన కేంద్రం, మార్చి 31 నాటికి దేశం నక్సల్ నుంచి విముక్తి పొందిందని పేర్కొంది. గతంలో నక్సల్ ప్రభావిత ప్రాంతాలుగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, ఝార్ఖండ్‌లోని పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లాల్లో కూడా ఇప్పుడు హింస నియంత్రణలోకి వచ్చిందని కేంద్రం తెలిపింది.

నక్సలిజం పూర్తిగా అంతమైనా, తిరిగి అది పుట్టకుండా ఉండేందుకు కేంద్రం జిల్లాలను రెండు కేటగిరీలుగా వర్గీకరించింది. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా, తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాలతో పాటు మొత్తం 37 లెగసీ అండ్ థ్రస్ట్ జిల్లాలుగా ప్రకటించింది. అక్కడ నక్సలిజం అంతమైనప్పటికీ భద్రతను పటిష్ఠం చేయడానికి అభివృద్ధిని కొనసాగించడానికి ప్రత్యేకంగా పర్యవేక్షణ కొనసాగించనున్నారు. ఝార్ఖండ్‌లోని పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లా ఒక్కదాన్ని మాత్రమే డిస్ట్రిక్ట్ ఆఫ్ కన్సర్న్ కేటగిరీలో ఉంచారు. ఇక్కడ నక్సల్స్ వ్యవస్థ చిన్నాభిన్నమైనా, సమీప భవిష్యత్తులో నిరంతర భద్రత అవసరమని పేర్కొన్నారు.

### 'నక్సలిజం నిర్మూలన ఒక పెద్ద విజయం'..

అధికారిక గణాంకాల ప్రకారం, నక్సల్ హింసలో ఇప్పటివరకు 17 వేలకుపైగా మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో పౌరులు, భద్రతా సిబ్బంది ఉన్నారు. ఈ నేపథ్యంలో నక్సలిజం నిర్మూలనను ఒక పెద్ద విజయంగా కేంద్రం అభివర్ణిస్తోంది. మరోవైపు, దశాబ్దాలుగా వేళ్లూనుకున్న నక్సలిజం నుంచి దేశానికి విముక్తి కల్పించామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా లోక్‌సభలో పేర్కొన్నారు. సాయుధ తీవ్రవాద ఉద్యమానికి మూలమైన మావోయిస్టు కేంద్ర కమిటీ నిర్మాణాన్ని దాదాపు విచ్ఛిన్నం చేశామన్నారు. 'వామపక్ష తీవ్రవాదం నుంచి దేశం విముక్తికి చర్యలు' అనే అంశంపై ఆయన లోక్‌సభలో షా ప్రసంగించారు.అలాగే, మావోయిస్టుల పొలిట్‌బ్యూరో, కేంద్ర వ్యవస్థను దాదాపు తుడిచిపెట్టేశామని, దీంతో నక్సల్స్ ముప్పు నుంచి దేశం విముక్తి పొందిందని షా ఇదివరకే ప్రకటించారు. మావోయిస్టులకు ఒకప్పుడు కంచుకోటగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో నక్సలిజం



దాదాపు అంతమైందన్నారు. అదేవిధంగా సమాజంలో అన్యాయాలకు పరిష్కార మార్గాలు రాజ్యాంగంలో ఉన్నాయని, ఆయుధాలు చేపట్టడం సరైన మార్గం కాదని షా చెప్పుకొచ్చారు. హింస ద్వారా కాకుండా చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని షా పేర్కొన్నారు. ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలో కలిసిన వారికి ప్రభుత్వం నుంచి అందాల్సిన ప్రయోజనాలను అందిస్తామన్నారు. పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అయితే, ఆయుధాలు పట్టుకుంటే మాత్రం మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. నక్సలిజాన్ని సమర్థించే వారు ఈ విషయాన్ని తెలుసుకోవాలని షా అన్నారు. అలాగే ఎన్‌డీఏ వచ్చాకే గిరిజనుల జీవితాల్లో మార్పులు వచ్చాయని తెలిపారు. నక్సలిజాన్ని దెబ్బతీసిన ఘనత ప్రధానంగా కేంద్ర, రాష్ట్ర బలగాలకే దక్కుతుందని పేర్కొన్నారు.నక్సలిజాన్ని దేశం నుంచి పూర్తిగా నిర్మూలించాలనే ఉద్దేశంతో మావోయిస్టులపై కేంద్రం కొన్నేళ్లుగా ఉక్కుపాదం మోపుతోంది. ఈ నేపథ్యంలో నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలను తీవ్రతరం చేసింది. ఆపరేషన్ కగార్ పేరుతో చాలా మంది నక్సలైట్లను మట్టుబెట్టింది. కర్రె గుట్ట వంటి పలు ప్రాంతాల్లో నిరంతర కూంబింగ్‌తో ఆపరేషన్ చేపట్టింది. పోలీసులు కథనాల ప్రకారం, గతేడాది జనవరి నుంచి ఛత్తీస్‌గఢ్‌లో ఆయా ఎన్‌కౌంటర్‌లలో నంబాల కేశవ రావు వంటి అగ్ర నేతలతో సహా 500 మందికిపైగా మావోయిస్టులు హతమయ్యారు. అదే విధంగా, రాష్ట్రంలో దాదాపు 1,900 మంది నక్సలైట్లు అరెస్టయ్యారు. మరో 2,500 మందికి పైగా లొంగిపోయారు.

## గ్లోబల్ హబ్‌గా తెలంగాణ ఎదుగుతోంది

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తెలంగాణ యువ రాష్ట్రంగా రక్షణ తయారీ, ఔషధ రంగం, ఐటీ రంగాల్లో గ్లోబల్ హబ్‌గా ఎదుగుతోందని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ. వి. బాలకిష్టారెడ్డి అన్నారు. పరిశ్రమలకు, విద్యా సంస్థలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించేందుకు నైపుణ్యాధారిత కోర్సులను, వినూత్న సిలబస్‌ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, ఏఐ ఆధారిత ట్యూటర్లు, కోడింగ్ సపోర్ట్ వంటి అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన ప్రతిష్టాత్మక న్యూకాసిల్ యూనివర్సిటీ ప్రతినిధి బృందం మంగళవారం టీజీసీహెచ్‌ఈ చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టా రెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యింది. ఈ సందర్భంగా న్యూకాసిల్ యూనివర్సిటీ ప్రతినిధులు సింగపూర్, మలేషియా దేశాల్లో తమ ఆఫ్‌క్యాంపస్ కేంద్రాలు ఉన్నాయని, భారతదేశంలో కూడా ఆఫ్‌క్యాంపస్ కేంద్రాల స్థాపన కోసం పలు నగరాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. సమావేశంలో కృత్రిమ మేధస్సు (ఏఐ), డేటా సైన్స్, ఇన్నోవేషన్ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్, సస్టైనబుల్ నగరాలు, అగ్రో బిజినెస్, మేనేజ్‌మెంట్ వంటి రంగాల్లో కలిసి పనిచేసేందుకు ఉన్న అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ఇప్పటికే సింగపూర్, మలేషియాల్లో ఆఫ్‌క్యాంపస్ కేంద్రాలను నిర్వహిస్తున్నామని, అదే తరహాలో భారతదేశంలో కూడా కేంద్రాన్ని స్థాపించేందుకు అనువైన నగరాలను పరిశీలిస్తున్నామని న్యూకాసిల్ ప్రతినిధులు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ', ఏఐ యూనివర్సిటీ, 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టుల గురించి చైర్మన్ వివరించారు. రైజింగ్ తెలంగాణ విజన్ 2047 లక్ష్య సాధనలో ఉన్నత విద్య నైపుణ్యాభివృద్ధి కీలకమని, ఇందులో న్యూకాసిల్ వంటి అంతర్జాతీయ భాగస్వామ్యాలు ఎంతో కీలకం కానున్నాయని ఆయన పేర్కొన్నారు. న్యూకాసిల్ యూనివర్సిటీ బృందం తమకున్న యుకే నేషనల్ హెల్త్ సర్వీస్ (ఎన్ హెచ్ఎస్) అనుబంధాన్ని, డేటా అనలిటిక్స్, అగ్రో బిజినెస్‌లో విద్యార్థులకు అందిస్తున్న ప్రాక్టికల్ అనుభవాన్ని వివరించింది. ఈ సమావేశం అత్యంత సానుకూల వాతావరణంలో ముగిసింది. భవిష్యత్తులో పరస్పర సహకారానికి మార్గాలను అన్వేషించాలని ఇరువర్గాలు నిర్ణయించుకున్నాయి. ఈ బృందంలో ప్రొఫెసర్ స్టీవర్ట్ రాబిన్సన్ (డీన్, ఆపరేషనల్ రీసెర్చ్), డాక్టర్ ఆదిత్య నారాయణ్ శర్మ (గ్లోబల్ స్పెషల్ అడ్వైజర్ - ఇండియా), శ్రీ బ్యారీ హాడ్జ్‌సన్ (డిప్యూటీ డైరెక్టర్, నేషనల్ ఇన్నోవేషన్ సెంటర్ ఫర్ డేటా), సంజనా మెడిపల్లి (హెడ్ ఆఫ్ ఇంటర్నేషనల్ పార్ట్‌నర్‌షిప్) పాల్గొన్నారు.



## మార్కెట్ యార్డుల్లో 'జీరో బిజినెస్' జరగొద్దు



**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలలో మార్కెట్ రుసుము వసూళ్లను పారదర్శకంగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గత రెండు సంవత్సరాల్లో మార్కెటింగ్ యార్డులలో రూ. 568.50 కోట్లతో 630 అభివృద్ధి పనులను ప్రభుత్వం మంజూరు చేసిందని, వీటిలో రూ. 128 కోట్ల విలువైన 113 పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. బుధవారం సచివాలయంలో మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇంకా కొన్ని చోట్ల జీరో బిజినెస్ జరుగుతున్నట్లు ప్రభుత్వం దృష్టికి వస్తోందని, దీనిపై కఠినంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. అక్రమాలకు పాల్పడే ట్రేడర్ల లైసెన్సులు రద్దు చేయడానికి వెనుకాడవద్దని, దీనికి ఎవరైనా అధికారులు సహకరిస్తే వారిపై కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, వాటి పురోగతిని ప్రతిరోజూ సమీక్షించేలా ఒక డాష్‌బోర్డును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మార్కెట్ యార్డులకు వచ్చే రైతులకు అవసరమైన సౌకర్యాలను ప్రాధాన్యత క్రమంలో కల్పించాలని సూచించారు. గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీలో 'స్మార్ట్ మార్కెట్ యార్డ్' సాఫ్ట్‌వేర్ పనితీరును పరిశీలించి, ఫలితాలు ఆశాజనకంగా ఉంటే అన్ని మార్కెట్ యార్డులను డిజిటలైజేషన్ చేసి జీరో బిజినెస్‌ను అరికట్టాలని పేర్కొన్నారు. కోహెడ పండ్ల మార్కెట్ పనులకు సంబంధించి సర్వే పూర్తయిందని, త్వరలోనే టెండర్ల ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతి పనికి ప్రారంభ తేదీ, గడువు తేదీని నిర్ణయించుకుని నిర్దిష్ట కాలపరిమితిలో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే, విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించేందుకు గ్రిడ్ అనుసంధానంతో కూడిన సోలార్ రూఫ్ టాప్ ప్యానెళ్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసే అవకాశాలను పరిశీలించాలన్నారు. జూలై చివరికల్లా ఈ పనులు పూర్తి కావాలని లక్ష్యంగా పెట్టారు. ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన తార్పాలిన్లు, తేమ కొలిచే పరికరాలు, క్లీనింగ్ డ్రైయర్లను అన్ని కేంద్రాల్లో సిద్ధంగా ఉంచాలని మంత్రి ఆదేశించారు. మొక్కజొన్న పండించిన రైతులను ఆదుకునేందుకు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు జరిపి, ఆ మొత్తాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ముఖ్యమంత్రి అనుమతితో నిధులు సమకూరుస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కార్యదర్శి సురేంద్ర మోహన్, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి, మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో కాంగ్రెస్ నేతలకు శుభవార్త

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తెలంగాణలో కాంగ్రెస్ నేతలకు శుభవార్త అందింది. త్వరలోనే నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు. దీంతో ఎప్పటి నుంచో నామినేటెడ్ పోస్టులపై ఆశలు పెట్టుకున్న ఆశావహుల్లో ఇప్పుడు కొత్త ఆశలు రేకెత్తుతున్నాయి. అయితే ఈ నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయంలో పార్టీ కోసం పనిచేసిన వారు, సామాజిక సమీకరణాలను ఆధారంగా చేసుకుని.. నియమించాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. అసమ్మతి రేగకుండా తగిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. తెలంగాణలో నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ త్వరలోనే మొదలు కానుంది. దీంతో గంపెడు ఆశలతో ఉన్న కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు.. ఇప్పుడు తమ ప్రయత్నాలు ప్రారంభించారు. బుధవారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ కీలక సమావేశం జరిగింది. తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ భేటీ అయి.. నామినేటెడ్ పోస్టుల భర్తీ, అభ్యర్థుల ఎంపిక వంటి పలు విషయాలపై సమగ్రంగా చర్చలు జరిపారు. ఈ క్రమంలోనే నామినేటెడ్ పోస్టులను వీలైనంత తొందరగా భర్తీ చేసేందుకు.. ఈ కసరత్తు ప్రక్రియకు సీఎం రేవంత్ రెడ్డి పచ్చజెండా ఊపారు.

కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం.. పార్టీ అభివృద్ధి కోసం నిత్యం శ్రమించిన నాయకులను గుర్తించి వారికి నామినేటెడ్ పదవులు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఇక ఈ నామినేటెడ్ పదవులను కేటాయించడంలో సామాజిక సమీకరణాలకు పెద్దపీట వేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. ఎవరికీ అన్యాయం జరగకుండా.. అన్ని వర్గాలను పరిగణలోకి తీసుకుని.. సమన్యాయం జరిగేలా ఆశావహుల జాబితాను తయారు చేసినట్లు తెలుస్తోంది. అదే సమయంలో సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో జరిగిన ఈ భేటీలో ప్రధానంగా టీపీసీసీ కమిటీ కూర్పుపై దృష్టి పెట్టారు. వీటితోపాటు కార్పొరేషన్ చైర్మన్ పదవులు, జిల్లా స్థాయి కమిటీల భర్తీపైనా తుది నిర్ణయం తీసుకున్నారు. ఇక ఇప్పటికే జిల్లా స్థాయి నామినేటెడ్ పోస్టుల లిస్ట్‌ను పార్టీ హైకమాండ్ రెడీ చేసింది. అర్హత, కష్టపడేతత్వం ఉన్న వారికే ఈ పోస్టుల్లో ప్రాధాన్యతనివ్వాలని సీఎం రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. ఇందులో గ్రూపు రాజకీయాలకు ఎలాంటి ఆస్కారం లేకుండా కేవలం మెరిట్ ఆధారంగానే ఎంపిక జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు వెల్లడించాయి.



# ప్రధాన రహదారి పక్కన చెత్త కుప్పలు

- మంబాపూర్‌లో గ్రామంలో అధ్వాన స్థితి
- ట్రాన్స్ ఫార్మర్ పక్కనే చెత్త పేరుకుపోవడంతో ప్రజలకు ఇబ్బందులు



**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** వికారాబాద్ జిల్లా తాండూర్ నియోజకవర్గం పెద్దముల్ మండల పరిధిలోని మంబాపూర్ గ్రామంలో ప్రధాన రహదారి పక్కన చెత్తాచెదారం పేరుకుపోవడంతో తీవ్ర అసౌకర్య పరిస్థితులు నెలకొన్నాయి.ముఖ్యంగా పెద్దేముల్ వైపు నుండి మంబాపూర్ గ్రామానికి వెళ్లే రహదారి ప్రక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ సమీపంలో చెత్త కుప్పలు పేరుకు పోవడం ప్రజలను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తోంది. గ్రామస్తులు నిర్లక్ష్యంగా రోడ్డు పక్కనే చెత్త వేయడం వల్ల ఆ ప్రాంతం పూర్తిగా అధ్వానంగా మారింది.దుర్వాసనతో పాటు పరిసరాలు కలుషితమవడంతో పాదచారులు,వాహనదారులు, కాలనీవాసులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇదే మార్గంలో మంబాపూర్ నుంచి పెద్దేముల్, జనగాం వైపు వెళ్లే ప్రధాన రహదారి ఉండడంతో ప్రతిరోజూ పదుల సంఖ్యలో వాహనాలు రాకపోకలు జరుపుతుంటాయి.ఇలాంటి రోడ్డు మార్గం ప్రక్కల చెత్తాచెదారం పేరుకుపోవడం వల్ల స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రోడ్డు పక్కన చెత్త ఉండటంతో దుర్వాసన, ఈగలు, దోమలు పెరిగి ప్రజల ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. ఇప్పటికైనా గ్రామస్థాయి అధికారులు స్పందించి వెంటనే చెత్తను తొలగించి శుభ్రత చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు రాకుండా చెత్త పారవేయడంపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## లక్షలు ఖర్చుచేసిన ట్రాక్టర్

# మూలన పడేసిన అధికారులు

- ఖానాపూర్ గ్రామ పంచాయతీలో 6,7 నెలలుగా నిలిచిపోయిన ట్రాక్టర్ వినియోగం
- తప్పపట్టి మూలకు చేరిన ప్రభుత్వ వాహనం
- చెత్త సేకరణలో ఆటంకాలు... పారిశుద్ధ్య పనులపై తీవ్ర ప్రభావం ?
- రూ.6.90 లక్షల ప్రజాధనం వృథా అవుతుందా ?
- మరమ్మత్తులు లేక వాహనం పనికిరాని స్థితి
- ఉన్నతాధికారులు పర్యవేక్షణ లోపంతోనే ఇలాంటి పరిస్థితి అని ఖానాపూర్ గ్రామస్తుల ఆరోపణ..
- ప్రభుత్వ ఆస్తుల సంరక్షణపై ప్రశ్నలు
- వెంటనే ట్రాక్టర్ కు మరమ్మత్తులు చేయించాలని కోరుతున్న ఖానాపూర్ గ్రామ ప్రజలు






**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:**

వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామ పంచాయతీలో ప్రభుత్వ నిధులతో కొనుగోలు చేసిన ట్రాక్టర్ నెలల తరబడి నిరుపయోగంగా పడి ఉండడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.గ్రామంలో పారిశుధ్య పనులు,త్రాగునీటి సరఫరా వంటి ముఖ్య అవసరాలకు ఉపయోగపడాల్సిన ఈ వాహనం ప్రస్తుతం ఒక మూలకు పడి తప్పు పట్టే స్థితికి చేరడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది.గత ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి దృష్ట్యా ప్రతి గ్రామానికి ట్రాక్టర్, ట్రాలీ, త్రాగునీటి ట్యాంకర్ లను అందించారు.అందులో భాగంగా ఖానాపూర్ గ్రామ పంచాయతీకి కూడా సుమారు రూ.6 లక్షల 90 వేల రూపాయల వ్యయంతో ఓ నూతన ట్రాక్టర్, ట్రాలీ, త్రాగునీటి ట్యాంకర్ లను కొనుగోలు చేయడం జరిగింది.అయితే ప్రస్తుతం ఆ ట్రాక్టర్ సుమారు 6,7 నెలల నుండి పనికిరాని స్థితిలో ఉండిపోవడం గమనార్హం.ముఖ్యంగా ఖానాపూర్ గ్రామంలో చెత్త సేకరణ, పారిశుద్ధ్య నిర్వహణ, త్రాగునీటి సరఫరా వంటి పనులు ఈ ట్రాక్టర్ ద్వారానే జరగాల్సి ఉండగా,అది నిరుపయోగంగా ఉండటంతో ఈ సేవలు సక్రమంగా అందడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తూ ఆరోపిస్తున్నారు.ట్రాక్టర్ కు మరమ్మత్తులు చేయించేందుకు సంబంధిత అధికారులు ఏలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజాధనం వృధా అవుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. క్షేత్రస్థాయిలో గ్రామాల్లో ఉన్నతాధికారులు, మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఈ పరిస్థితి నెలకొన్నదని స్థానికులు ఆరోపిస్తున్నారు.ప్రభుత్వ గ్రామ పంచాయతీ ఆస్తిగా ఉన్న ట్రాక్టర్ వాహనం ఇలా నిండు నిర్లక్ష్యానికి గురవడం పట్ల గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్రాక్టర్ కు తక్షణమే మరమ్మత్తులు చేయించి మళ్లీ వినియోగంలోకి తీసుకురావాలని ఖానాపూర్ గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.గ్రామ అభివృద్ధి,పారిశుధ్య పనుల కోసం ట్రాక్టర్ అత్యవసరమని ప్రజలు పేర్కొంటున్నారు.



సెలవుల సమయంలో

## పిల్లల భద్రతపై పోలీసుల హెచ్చరిక

**మోమిన్ పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మోమిన్‌పేట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. వెంకట్ మోమిన్ పేట్, మర్పల్లి, నవాబ్‌పేట్ మండల ప్రజలకు ముఖ్య సూచనలు చేశారు.ఎస్.ఎస్.సి, ఇంటర్ పరీక్షలు పూర్తై విద్యార్థులకు సెలవులు ప్రారంభమైన నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.సెలవుల సమయంలో పిల్లలు బావులు, క్వారీలు, చెరువులు వంటి ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లి ఈతకు ప్రయత్నించే అవకాశం ఉన్నందున, అలాంటి ప్రదేశాలకు వెళ్లకుండా కట్టుదిట్టంగా పర్యవేక్షించాలన్నారు. అలాగే,బావులు మరియు క్వారీ యజమానులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, భద్రతా చర్యలు తీసుకోవడం తప్పనిసరి అని సూచించారు. నిర్లక్ష్యం వల్ల ప్రమాదాలు జరిగితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి చిన్నారుల భద్రతకు సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.




# ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

- చిన్న సమస్యలకు బయటకు రిఫర్ చేయొద్దు : ఎమ్మెల్యే సంజీవ రెడ్డి

**నారాయణఖేడ్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వ ఆసుపత్రులపై ఉందని, ప్రతి చిన్న సమస్యకు రోగులను బయటకు రిఫర్ చేయకుండా స్థానికంగానే చికిత్స అందించాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి వైద్యులకు సూచించారు. బుధవారం పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి సంఘం సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ శెట్కర్, ఆసుపత్రి అధికారులతో కలిసి వైద్య సేవలు, మౌలిక సదుపాయాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రజలకు మెరుగైన ఉచిత వైద్యం అందించడమే లక్ష్యమని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సిబ్బంది కృషి చేయాలని ఆదేశించారు.

ఆసుపత్రిలో అవసరమైన మందుల నిల్వలు, పారిశుద్ధ్యం, అధునాతన పరికరాల లభ్యతపై చర్చించి, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి



చేయాలని సూచించారు.పేద ప్రజలు నమ్మకంతో ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయిస్తారని, డాక్టర్లు సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.

హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ నిధులను ఆసుపత్రి అభివృద్ధి, అత్యవసర సేవల కోసం నిబంధనల ప్రకారం వినియోగించాలన్నారు. మహిళల్లో గర్భాశయ క్యాన్సర్ నివారణలో హెచ్.వి.పీ వ్యాక్సిన్ కీలకమని పేర్కొంటూ, 9 నుంచి 14 ఏళ్ల బాలికలకు ఈ టీకా ఇవ్వడం ద్వారా భవిష్యత్‌లో క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించవచ్చన్నారు.ఈ వ్యాక్సినేషన్‌పై అవగాహన పెంచి,అర్హులైన ప్రతి బాలికకు టీకా అందేలా చూడాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ రమేష్, వైద్యులు, కమిటీ సభ్యులు,మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత పై విద్యార్థులకు అవగాహన

**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మండల పరిధిలోని ముస్లాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఎస్ఐ శంకర్ ఆధ్వర్యంలో బుధవారం పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రతపై డ్రాయింగ్ కాంపిటీషన్ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు. సందర్భంగా రోడ్డు భద్రతపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి మానవహారం నిర్వహించారు.అనంతరం రోడ్డు ప్రమాదాలు నివారణకు పలు జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం రమేష్, తదితరులు పాల్గొన్నారు.




## వరి కొనుగోలు కేంద్రాలను

# సద్వినియోగం చేసుకోవాలి



**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ప్రభుత్వం రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తాసిల్దార్ మల్లయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శేషారెడ్డి లు అన్నారు. మండల పరిధిలోని ముస్లాపూర్, రెడ్డిపల్లి,అప్పాజీపల్లి గ్రామాలలో వరి కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ..రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. రైతులు ఎలాంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి అమ్ముకోవాలని సూచించారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతుందని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు బలరాం,జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు అంజా గౌడ్,ఆయా గ్రామాల సర్పంచులు నరసింహారెడ్డి,రవి, వీరన్న,శ్రీనివాస్ రెడ్డి,శంకర్ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభు, సాయిబాబా,సొసైటీ సీఈఓ శివ గౌడ్, సొసైటీ స్టాఫ్ నాగయ్య,సాయి తదితరులు పాల్గొన్నారు.






# రోడ్ సేఫ్టీలో భాగంగా స్కూల్ జోన్ బోర్డుల ఏర్పాటు

- రోడ్ సేఫ్టీపై విద్యార్థుల్లో చైతన్య
- స్వామి వివేకానంద పాఠశాలలో విద్యార్థులకు రోడ్ సేఫ్టీ పై డ్రాయింగ్ పోటీలు
- స్వామి వివేకానంద పాఠశాల సమీపంలో 2 స్కూల్ జోన్ బోర్డుల ఏర్పాటు
- పెద్దేముల్ ఎంఈఓ నర్సింగ్ రావు


**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని పెద్దేముల్ ఎంఈఓ నర్సింగ్ రావు అన్నారు.ముఖ్యంగా “అరైవ్ అలైవ్ చిల్డ్రన్స్ రోడ్ సేఫ్టీ డే” సందర్భంగా ఈ కార్యక్రమాలను చేపట్టారు.ఈ కార్యక్రమాల్లో భాగంగా పెద్దేముల్ మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాలల స్థాయిలో డ్రాయింగ్ పోటీలు, ఉన్నత పాఠశాలలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు.రోడ్డు భద్రతకు సంబంధించిన అంశాలపై విద్యార్థులు చిత్రాలు వేయడం,వ్యాసాలు రాయడం ద్వారా అవగాహన పెంపొందించేందుకు చర్యలు తీసుకున్నారు.ఈ సందర్భంగా విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు.రోడ్డు ప్రమాదాలను నివారించడంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందని సూచించారు. అదేవిధంగా విద్యార్థుల భద్రత దృష్ట్యా పెద్దేముల్ మండల కేంద్రంలోని స్వామి వివేకానంద పాఠశాల ఆధ్వర్యంలో పాఠశాల సమీపంలో “స్కూల్ జోన్” బోర్డులను ఏర్పాటు చేయించారు.దీంతో రహదారి దాటేటప్పుడు విద్యార్థులు సురక్షితంగా ప్రయాణించేలా చర్యలు తీసుకున్నట్లు ఎంఈఓ నర్సింగ్ రావు తెలిపారు. విద్యార్థుల్లో రోడ్డు భద్రతపై చైతన్యం పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో పెద్దేముల్ ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్, స్వామి వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ కరుణాకర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ బాల్ రాజ్ గౌడ్, కానిస్టేబుల్ జగన్,స్వామి వివేకానంద పాఠశాల ఉపాధ్యాయుడు ద్యావరి అశోక్, సిబ్బంది భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

## బోరంచ నల్ల పోచమ్మ

# జాతర ఘనంగా నిర్వహించాలి

**- ఎమ్మెల్యే సంజీవరెడ్డి**

**నారాయణఖేడ్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మానూర్ మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బోరంచ గ్రామంలో జరగనున్న శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి 7 వారాల జాతరను ఘనంగా నిర్వహించాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నెల 23 నుంచి జూన్ 4 వరకు జరగనున్న జాతర ఏర్పాట్లపై ఆలయ ప్రాంగణంలో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ముందుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే, అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు.జాతరకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశమున్నందున త్రాగునీరు, చలువ పందళ్లు వంటి సౌకర్యాలను సమృద్ధిగా కల్పించాలని తెలిపారు. వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని, ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని పోలీసులకు సూచించారు.పరిసరాల్లో పరిశుభ్రతను కాపాడుతూ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. క్యూ లైన్లలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా వాలంటీర్లు, పోలీసు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని



చెప్పారు.ఎండ తీవ్రత దృష్ట్యా భక్తులు జాగ్రత్తలు పాటించాలన్నారు. అలాగే వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి అత్యవసర సేవలు అందించాలని సూచించారు. భక్తుల రవాణా సౌకర్యార్థం అదనపు ఆర్టీసీ బస్సులు నడపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.“తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో ఈ జాతరకు వస్తారు. వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించడం మనందరి బాధ్యత” అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ సమావేశంలో



ఆలయ ఈఓ మహా రుద్రప్ప, కమిటీ చైర్మన్ మల్లయ్య, సర్పంచ్ బీరప్ప,ఉప సర్పంచ్ కలీల్,ఎంఆర్వో విష్ణు సాగర్, వివిధ శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# త్రాగునీటి కోసం విద్యార్థుల తంటాలు

- మన్ సాన్ పల్లి పాఠశాలలోని బోరుబావిలో నీరు ఎండిపోవడంతో తీవ్ర నీటి సమస్య
- 2,3 రోజులుగా నీటి కొరతతో విద్యార్థుల ఇబ్బందులు
- ఒకే ప్రాంగణంలో ప్రాథమిక పాఠశాల, అంగన్ వాడీ కేంద్రం
- విద్యార్థుల త్రాగునీటి సమస్యపై గ్రామ పంచాయతీకి సమాచారం ఇచ్చిన పాఠశాల ఉపాధ్యాయులు
- త్రాగునీటి ట్యాంకర్ ను పాఠశాలకు పంపిన గ్రామ సర్పంచ్,పంచాయతీ అధికారులు
- గ్రామ పంచాయతీ ట్యాంకర్ తో నీటి సరఫరా..విద్యార్థులకు తాత్కాలిక ఉపశమనం
- త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్న ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులు







**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:**

వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండల పరిధిలోని మన్ సాన్ పల్లి ప్రాథమిక పాఠశాలలో త్రాగునీటి సమస్య తీవ్రంగా మారింది. పాఠశాలలో ఉన్న బోరుబావిలో నీరు పూర్తిగా అడుగంటిపోవడంతో విద్యార్థులు త్రాగునీటి కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు.గత రెండు మూడు రోజులుగా త్రాగునీటి సమస్య విద్యార్థులను తీవ్రంగా వేధిస్తోందని సమాచారం.ఇదిలా ఉంటే ఒకే ప్రాంగణంలో ప్రాథమిక పాఠశాల, అంగన్ వాడీ కేంద్రం ఉండగా ప్రాథమిక పాఠశాలలో మొత్తం 27 మంది విద్యార్థులు అందులో బాలురు 12 మంది, బాలికలు 15 మంది, వారికి బోధించడానికి ఇద్దరు మహిళా ఉపాధ్యాయులు,అంగన్ వాడీ కేంద్రంలో మొత్తం 12 మంది చిన్నారులు ఉండగా వారికి బోధించడానికి ఒక అంగన్వాడీ టీచర్ ఉన్నారు.విద్యార్థులు త్రాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని గమనించిన పాఠశాల ఉపాధ్యాయులు స్థానిక సర్పంచ్ కు, గ్రామ పంచాయతీ సిబ్బందికి సమాచారం అందించారు. అందుకు స్పందించిన గ్రామ సర్పంచ్, పంచాయతీ అధికారులు గ్రామ పంచాయతీ నీటి ట్యాంకర్ ను పాఠశాలకు పంపి విద్యార్థులకు త్రాగునీటి సరఫరాను చేసి తాత్కాలిక ఉపశమనాన్ని కల్పించారు.ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మాట్లాడుతూ..పాఠశాలలో ఉన్న బోరుబావిలో నీరు అడుగంటి పోవడంతో గత రెండు, మూడు రోజులుగా త్రాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.ఒకే ప్రాంగణంలో అంగన్ వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల ఉండడంతో త్రాగునీటి అవసరం మరింత పెరిగిందని తెలిపారు. దీంతో చిన్నారులు త్రాగునీటి కోసం తీవ్ర కష్టాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యార్థుల త్రాగునీటి కష్టాలను తీర్చడానికి శాశ్వత పరిష్కారం చూపాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు.పాఠశాలలో త్రాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించి విద్యార్థులకు ఇబ్బందులకు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.



## ఆశ్రమ నిర్వాహకులను అభినందించిన హైకోర్టు న్యాయమూర్తి

**నందికొట్కూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మానవ సేవయే మాధవసేవ అన్నట్లు ముఖ్యంగా వృద్ధుల సేవ అత్యంత పుణ్యకార్యం అని బుధవారం నందికొట్కూరు పట్టణంలోని శ్రీ కాళీ ప్రసాద ఆశ్రిత వృద్ధాశ్రమని హైకోర్టు న్యాయమూర్తి హరినాథ్ రెడ్డి సందర్శించి నిర్వాహకులను అభినందించారు.ఈ సందర్భంగా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి మాట్లాడుతూ..ఈ ఆశ్రమాన్ని సందర్శించడంతో నా కు మా పితృదేవులను దర్శించినట్లు ఉందని వృద్ధులతో యోగక్షేమాలు అడిగి ఆనందాన్ని పంచుకోవడం జరిగిందన్నారు.రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఎన్ హరినాద్ రెడ్డి పల్లె ప్రియాంక సేవా సమితి అధ్యక్షులు రిటైర్డ్ జిల్లా న్యాయమూర్తి పల్లె మోహన్ రావు ఆహ్వానం మేరకు వృద్ధాశ్రమాన్ని సందర్శించడం జరిగింది. అనంతరం ఆశ్రమంలోని వృద్ధులతో కలిసి ఉదయం అల్పాహారం స్వీకరించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సివిల్ సీనియర్ న్యాయమూర్తి శోభారాణి,జువాజీ సుంకన్న గౌడ్ సేవా సమితి,సన్మార్ సేవా సంస్థ విభిన్న ప్రతిభావంతులు నాగన్న, ఎల్ నరసింహారెడ్డి ధర్మారెడ్డి, శివరాముడు,శోభారాణి, 1983 పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు శ్రీ రామ థియేటర్ యజమాని రామిరెడ్డి, లక్ష్మీనారాయణ,జార్జ్ ఆశ్రమ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సిఐటియు రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

**నందికొట్కూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ఈనెల 17, 18, 19 తేదీలలో నంద్యాలలో జరిగే సిఐటియు రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డ్ వద్ద జీపు జాతను ప్రారంభించారు.ఈ సందర్భంగా వ్యాకాస జిల్లా అధ్యక్షులు ఎం.నాగేశ్వరావు మాట్లాడుతూ..కార్మికులు త్యాగాలతో 29 చట్టాలను సాధించుకుంటే బిజెపి 4చట్టాలకు కుదించడంతో కార్మికులు కట్టు బానిసలు అయ్యారు అన్నారు. జీఎస్టీ పెంచి ప్రజల వద్ద లక్షలు దండుకొని ప్రస్తుతం జీఎస్టీ తగ్గించి ప్రజలకు మేలు చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటుంది తప్ప ప్రజలకు మేలు కలిగింది ఏమి లేదని మండిపడ్డారు. అదేవిధంగా ఉద్యోగుల కార్మికుల వేతనాలు పెరగకపోవడంతో ప్రజల కొనుగోలు శక్తి పడిపోయింది అన్నము రామచంద్ర అని బ్రతికిడుస్తుంటే కొత్తగా స్మార్ట్ మీటర్లు తెచ్చి వినియోగదారుల జేబులు కొల్లగొడుతుందని చిన్న మధ్య తరహా పరిశ్రమలకు రైతులకు ప్రభుత్వాలు సబ్సిడీలు ఇవ్వడం లేదన్నారు.ఈ మహాసభకు జాతీయ నాయకులు రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారని అన్నారు, ఈజీప్ జాత బొల్లవరం ,దామ గట్ల, బ్రాహ్మణ కొట్టుకూరు, అల్లూరు, వడ్డెమాను కోలేటమ్మ పల్లె, మల్యాల, బిజినేమోల కొణిదెల, గ్రామాలలో జీపు జాత నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పి.పక్కిరి సాహెబ్, టి.ఓబులేసు,వేణుగోపాలు, పాండు,స్వాములు,రంగస్వామి, కృష్ణుడు,సీతారాముడు, తదితరులు పాల్గొన్నారు.





## అక్రమ మద్యం విచ్చలవిడిగా అమ్మకాలు

**- బెల్టు షాపులపై చర్యలు లేకపోతే సి.పి.ఐ. (ఎం.ఎల్.) లిబరేషన్ ఉద్యమాలకు సిద్ధం**

**నందికొట్కూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** గ్రామీణ ప్రాంతాల్లో అక్రమ మద్యం విక్రయాలు విస్తరిస్తూ ప్రజల జీవన విధానాన్ని దెబ్బతీస్తున్న నేపథ్యంలో సి.పి.ఐ. (ఎం.ఎల్.) లిబరేషన్ పార్టీ జిల్లా బృందం నందికొట్కూరు తాలూకా బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐ మణికంఠ ని మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను వివరించింది.ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామాల్లో మద్యం ఏరులై పారుతుండటంతో సామాజిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. బెల్టు షాపుల ద్వారా అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని, వాటిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. మద్యం షాపుల్లో 18 ఏళ్ల లోపు ఉన వారు విక్రయాలు అక్రమ మద్యం విక్రయాల వల్ల మహిళలకు భద్రత లేదు శాంతి భద్రత లోపిస్తాయని అన్నారు. చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకుని గ్రామాల్లో శాంతి భద్రతలను కాపాడాలని ఎస్ఐ మణికంఠ ను కోరారు. అనంతరం ఎస్ఐ స్పందించి చట్టాన్ని ముల్లంగించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకురాలు ఎస్.బీబీ లక్ష్మీదేవి, ముత్తు జాబీ,నూర్జహాన్, మణికుమారి ,తర్తూరు నవ్యసాని, అలాగే పార్టీ జిల్లా నాయకులు టి.నరసింహులు, వేల్పుల ఏసన్న,లింగాల శ్రీనివాసులు, వడ్డే శ్రీరాములు, ముచ్చుమర్రి మాజీ సర్పంచ్ శివన్న తదితరులు పాల్గొన్నారు

## సీఎంఆర్ఎఫ్ చెక్ పంపిణీ

**ఎమ్మెల్యే గిత్త,గౌరు చేతుల మీదుగా**

**నందికొట్కూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరు గ్రామానికి చెందిన షేక్ సాజిదాబి కి రూ.36995/ మంజూరైన చెక్కును నందికొట్కూరు టిడిపి ఇన్చార్జ్ గౌరు వెంకటరెడ్డి, నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్యల చేతుల మీదుగా అందచేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఖాలీల్ బేగ్,ఫరూక్, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా కలెక్టర్ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ







**నంద్యాల,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నంద్యాల జిల్లా మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై సమగ్రంగా ఆరా తీసిన కలెక్టర్, సిబ్బంది నిర్లక్ష్యంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ 10 సూచన సలహాలు తెలియజేశారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉదయం 10:10 గంటల వరకు ఇద్దరు వైద్యులు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక ఫార్మసిస్ట్ విధులకు హాజరు కాకపోవడం పై ఆవేదన వ్యక్తం చేశారు.విధులకు హాజరుకాని ముగ్గురు సిబ్బంది తరపున ఎంపి.హెచ్.ఓ ద్వారా మూమెంట్ రిజిస్టర్‌లో సంతకాలు చేయడం వెలుగులోకి వచ్చింది.ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన కలెక్టర్,సంబంధిత ఐదుగురు సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసి ఆసుపత్రిలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చూడాలని,పరిసరాల్లో పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ హెచ్చరించారు.

## డ్రాయింగ్ ల ద్వారా ట్రాఫిక్ నియమాలను నేర్పిన ఉపాధ్యాయులు

**బాల్యంలోనే రోడ్డు నియమాలపై శిక్షణ అవసరం**

- మన్ సాన్ పల్లి ప్రాథమిక పాఠశాలలో ట్రాఫిక్ నియమాలపై ప్రత్యేక శిక్షణ
- విద్యార్థులకు ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రాముఖ్యతను వివరించిన ఉపాధ్యాయులు
- డ్రాయింగ్ ల ద్వారా రోడ్ సేఫ్టీ నేర్చుకొన్న మన్ సాన్ పల్లి విద్యార్థులు
- విద్యార్థుల్లో బాధ్యతాయుత భావన పెంపు
- మన్ సాన్ పల్లి ప్రాథమిక పాఠశాల ఇంచార్జి హెచ్ఎం సాయిరేణుక




**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** విద్యార్థులకు చిన్నప్పటి నుంచే ట్రాఫిక్ నియమాలపై అవగాహనను పెంపొందించడం అత్యంత అవసరమని మన్ సాన్ పల్లి ప్రాథమిక పాఠశాల ఇంచార్జి హెచ్ఎం సాయిరేణుక అన్నారు.బుధవారం మండల పరిధిలోని మన్ సాన్ పల్లి ప్రాథమిక పాఠశాలలో "ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు రోడ్డు భద్రత(రోడ్ సేఫ్టీ)పై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రాధాన్యత గురించి వివరించి అందులోని ఎరుపు,పసుపు,ఆకుపచ్చ రంగుల అర్థం,వాటి ప్రకారం వాహనదారులు,పాదచారులు ఎలా ప్రవర్తించాలి అనే విషయాలను సరళంగా వివరించారు.రహదారిపై నడిచేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలు,జీబ్రా క్రాసింగ్ వినియోగం, హెల్మెట్, సీట్ బెల్ట్ ప్రాముఖ్యత వంటి అంశాలను విద్యార్థులకు క్లుప్తంగా తెలియజేశారు. అదే విధంగా విద్యార్థులతో ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు భద్రతకు సంబంధించిన వివిధ రకాల చిత్రాలను స్వయంగా డ్రాయింగ్ రూపంలో వేయించారు.ఈ డ్రాయింగ్ ద్వారా విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించడంతోపాటు, నేర్చుకున్న విషయాలను సులభంగా గుర్తుంచుకునేలా చేశారు.ఈ సందర్భంగా మన్ సాన్ పల్లి ప్రాథమిక పాఠశాల ఇంచార్జి హెచ్ఎం సాయిరేణుక మాట్లాడుతూ..విద్యార్థులు రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకుంటే భవిష్యత్తులో బాధ్యతాయుత పౌరులుగా ఎదగడానికి అవకాశం ఉంటుందని, ట్రాఫిక్ నియమ నిబంధనలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు గిరిజ,అంగన్వాడీ టీచర్ లు ఈలవతి,శాంతిబాయి, ఆయా ముత్యాలమ్మ, పాఠశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.





**10 రోజుల నుండి**

## గ్రామానికి రాని పంచాయతీ కార్యదర్శి

**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండలం అడికిచర్ల గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి గత 10 రోజుల నుండి గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని అడికిచెర్ల గ్రామస్తుడు మహమ్మద్ అఫ్రోజ్ ఖాన్ ఆరోపించారు. ఈ మేరకు బుధవారం పెద్దేముల్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కే.తిరుమల స్వామికి,ఫోన్ వాట్సాప్ ద్వారా జిల్లా పంచాయతీ అధికారికి లిఖిత పూర్వకంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి పై వేరు వేరుగా ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా అడికిచెర్ల గ్రామస్తుడు మహమ్మద్ అఫ్రోజ్ ఖాన్ మాట్లాడుతూ..పెద్దేముల్ మండల పరిధిలోని అడికిచెర్ల గ్రామ పంచాయతీలో గ్రామ పంచాయతీ కార్యదర్శి గ్రామ ప్రజలకు గత 10 రోజుల నుండి అస్సలు అందుబాటులో ఉండడం లేదని, అసలు గ్రామానికి ప్రతి రోజు రావడం లేదని ఆరోపించారు.గ్రామ పంచాయతీ కార్యదర్శి కోసం తనతో పాటు చాలా మంది గ్రామస్తులు సుమారు 10 రోజుల నుండి వేచి చూస్తున్న పంచాయతీ కార్యదర్శి గ్రామంలోకి రావడం లేదని ఆరోపించారు. విధుల పట్ల పంచాయతీ కార్యదర్శి పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ,ప్రజా సమస్యలను, అడికిచెర్ల గ్రామస్తుల సమస్యలను గాలికి వదిలేస్తున్నారని,ఫోన్ చేస్తే కూడా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.అదే విధంగా ప్రతి రోజు విధులకు హాజరైనట్లు తాను వేసుకొనే తన హాజరును గ్రామ పంచాయతీ కారోబార్ ద్వారా తన ఫోన్ ఐడీ ఇచ్చి వేసుకుంటున్నారని మహమ్మద్ అఫ్రోజ్ ఖాన్ ఫిర్యాదులో లిఖితపూర్వకంగా పేర్కొన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న పంచాయతీ కార్యదర్శి పై శాఖాపరమైన చర్యలు తీసుకొని అడికిచెర్ల గ్రామ ప్రజలకు న్యాయం చేయాలని కోరారు.